క్లుప్తంగా

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

సిరిసిల్ల: జిల్లాలోని దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఏఎల్ఐఎంసీవో ద్వారా ఏడీఐపీ పథకంలో దివ్యాంగులకు తెలంగాణ వికలాంగుల కోపరేటివ్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో అర్హులకు ఉపకరణాలు, సహాయ పరికరాలు అందించనున్నారు. చేతికర్రలు, చంకకర్రలు, వీల్‌చైర్లు, చెవి వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిళ్లు, రోలేటర్స్, స్మార్ట్ కేన్, అంధుల చేతికర్రలు, ఎల్‌బో క్రచ్చెస్, కృత్రిమ అవయవాలు, అంధ విద్యార్థులకు స్మార్ట్‌ఫోన్లు, సహాయ ఉపకరణాలు అందించాలని భావిస్తున్నారు. ఆగస్టు 5న, బోయినపల్లి రైతువేదిక వద్ద, 6న ఇల్లంతకుంట రైతువేదిక, 7న వేములవాడ మండల పరిషత్ కార్యాలయాల సముదాయం వద్ద, 8న చందుర్తి రైతు వేదిక వద్ద, 9న ఎల్లారెడ్డిపేట లక్ష్మి మల్లారెడ్డి కన్వెన్షన్‌లో, ఆగస్టు 10న సిరిసిల్ల కొత్త బస్టాండు సినారె. కళామందిరం వద్ద శిబిరాలు జరుగుతాయని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తెలిపారు. మరిన్ని వివరాల కోసం 94404 69338, 94900 91770 నంబర్లలో సంప్రదించాలన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక


లిఖిత

బోయినపల్లి: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేటలో నాలుగో తరగతి ప్రవేశానికి మండలకేంద్రానికి చెందిన మొగులోజి లిఖిత ఎంపికైంది. 60 సీట్లు మాత్రమే ఉండే స్పోర్ట్స్ స్కూల్ ఎంపికకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి పలువురు విద్యార్థులు పోటీపడ్డారు. ఇందులో లిఖిత ప్రతిభ చూపి రాష్ట్రంలో 18వ ర్యాంకు సాధించిందని ఆమె తల్లిదండ్రులు మొగులోజి మానస గంగాచారి తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్‌లో ఎంపికకవడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని వినతి



తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీ గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 555లో 15 ఎకరాల స్థలాన్ని 2002లో అప్పటి ప్రభుత్వం ఈఎస్ఐ ఆస్పత్రి కోసం కేటాయించిందని, అందులో ఆస్పత్రి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రి నిర్మిస్తే ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్ మూడు జిల్లాల బీడీ కార్మికులకు మేలు జరుగుతుందని తెలిపారు. అప్పటి ప్రభుత్వం కేవలం కాంపౌండ్ వాల్ నిర్మించి వదిలేశారని చొరవ చూపి ఆస్పత్రి నిర్మాణానికి కేంద్ర నిధులు కేటాయించాలని కోరారు. మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, ఉపాధ్యక్షుడు ఇటికల రాజు, ప్రధాన కార్యదర్శి కాశీచరణ్, మహిళా అధ్యక్షురాలు భవిత, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

గంభీరావుపేట: సంఘాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మండలకేంద్రానికి చెందిన పలు కులసంఘాల నాయకులు శనివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను కరీంనగర్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. మున్నూరుకాపు, రజక, శాలివాహన, యాదవ, గౌడ, స్వర్ణకార, ముదిరాజ్, అంబేడ్కర్ సంఘాల నాయకులు ఉన్నారు. వారి వెంట బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్ ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత



గంభీరావుపేట: ప్రజారోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, మండలశాఖ అధ్యక్షుడు హమీద్ అన్నారు. మండలంలోని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన నారం బాలయ్య అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లలేని స్థితిలో ఉండగా రూ.2.50లక్షల ఎల్‌వోసీ ఇప్పించి శనివారం ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, శెట్టి రవి, సతీశ్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

మిడ్‌మానేరులో 14 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టులో శనివారం నీటిమట్టం 14.347 టీఎంసీలకు చేరింది. ఎల్లంపల్లి నుంచి వరదకాల్వ మీదుగా 12,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

ఎస్సీ వర్గీకరణపై హర్షం

తంగళ్లపల్లి: మండలంలోని గోపాలరావుపల్లెలో శనివారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బొల్లారం చంద్రమౌళి మాదిగ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు హర్షనీయమని, మాదిగల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. జిల్లా కో కన్వీనర్ కమలాకర్, దుర్గప్రసాద్, మాదిగ కుల బాంధవులు పాల్గొన్నారు.

పూజకు వేళాయే..

- కళకళలాడుతున్న పూజాస్టోర్స్
- సిరిసిల్లలో పూజా భండార్లకు డిమాండ్
- రేపటినుంచి శ్రావణమాసం ప్రారంభం



సిరిసిల్లటౌన్: భక్తులు శ్రావణ మాసంలో ఆధ్యాత్మికత చింతనతో ఎక్కువగా గడుపుతుంటారు. ఈమాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తే దేవుళ్ల అనుగ్రహం ఉంటుందని ప్రజల్లో ప్రగాఢ నమ్మకం. దైవరాధనకు ఈ నెలలో ప్రతిరోజు ప్రత్యేకమే. రేపటి నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. దీంతో ప్రజలు పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా సిరిసిల్లలోని పూజాస్టోర్స్ బిజీగా కనిపిస్తున్నాయి. ఒకేచోట అన్నిరకాల దివ్యద్రవ్యాలను అందించే పూజాస్టోర్స్‌పై సండేస్పెషల్ కథనం..

పూజలకు ప్రత్యేకం..

ఇంట్లో శుభ, అశుభ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిపితే పండితులు రాసిచ్చిన లిస్ట్‌తో మార్కెట్లో దుకాణాలన్నీ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. పూజాసామగ్రి ఒకే దగ్గర దొరికే పదుల సంఖ్యలో పూజాస్టోర్స్ పట్టణంలో వెలిశాయి. వీటిలో ప్రతి పూజకు పూజాకిట్లు రూపంలో రెడీగా ఉంచుతున్నారు. అవసరమైన పూజలకు గాను ఆకిట్‌ను పూజాస్టోర్స్ నిర్వాహకులు క్షణాల్లో అందిస్తున్నారు. గతంలో వేములవాడ, కరీంనగర్ తదితర పట్టణాల నుంచి పూజాసామగ్రిని కొనుక్కునే వారు. ఇప్పుడు సిరిసిల్లలోనే పూజాసామగ్రిని కొంటున్నారు. దసరా, దీపావళి, వినాయక చవితి, ఉగాది, సంక్రాంతి వంటి పండుగ రోజులతో పాటు అయ్యప్ప, హనుమాన్, జై శ్రీమన్నారాయణ, దుర్గామాత, మార్కండేయ, వారాహిమాత తదితర మాలలు ధరించే భక్తులకు దుకాణదారులు ప్రత్యేకంగా సామగ్రి అందిస్తున్నారు.



దివ్య ద్రవ్యాలకు ప్రతీతి..

దైవరాధనకు దివ్యద్రవ్యాల వినియోగం ప్రతీతి. పూజా సామగ్రిలో సిరిసిల్లలో తయారయ్యే వస్త్రాలకు మంచి డిమాండ్ ఉంది. ఇక కృతువులు, హోమాలకు కావాల్సిన దర్భ, రావి, జువ్వి, మామిడి, మేడి, చంద్ర, ఉత్తరేణి, మోదుగ, తెల్లజిల్లేడు, జమ్మి చెట్ల సమిధలు, అన్నిరకాల పూజాద్రవ్యాలు స్థానికంగా ఉన్న స్టోర్స్‌లో లభిస్తున్నాయి. మార్కెట్, గాంధీచౌక్, పెద్దబజార్, వెంకంపేట, తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో పూజాభండార్లు నిర్వాహకులు భక్తులకు కావాల్సిన వస్తువులు అందిస్తున్నారు. సిరిసిల్లలో ఉత్పత్తయ్యే జెండాలు, లుంగీలు, ధోవతులు, పంచెలు, చెల్లలు, పూజా కార్యక్రమాల్లో తప్పకుండా ఉండాల్సిందే. వీటితో పాటు ధూప, దీపాలు, కర్పూరం, అగర్‌వత్తులు, గంధం, గంగాజలం, పన్నీరు, ఆవుపేడ, ఆవుపంచకం, ఆవనూనె, నువ్వుల నూనె, నెయ్యి, ఆవునెయ్యి, తేనే, శక్కర, పాలు, పెరుగు, దేవుడి ఫొటోలు, విగ్రహాలు, సుగంధ ద్రవ్యాలు, కంకణాలు, జపమాలలు, కలశ చెంబులు, విభూతి, పసుపు, కుంకుమ, గులాలు, వివిధ మొక్కలకు సంబంధించి తొట్లు రెడీగా ఉన్నాయి.

సిరిసిల్ల వస్త్రాలకు డిమాండ్



సిరిసిల్లలో తయారయ్యే పూజలు, వ్రతాలకు కావాల్సిన పంచెలు, ధోవతులు, లుంగీలకు మంచి డిమాండ్ ఉంది. అయ్యప్ప, హనుమాన్, మార్కండేయ, మాలధారణ సమయంతో పాటు శ్రావణమాసం కార్తీకమాసంలో ఎక్కువగా గిరాకీ ఉంటుంది. అన్ని పూజలకు కావాల్సిన వస్త్రాలున్నాయి. లోకల్‌గా ఆర్డర్లు ఇచ్చి నేయిస్తాం. దేవతల జెండాలు కూడా ఇక్కడే తయారు చేయిస్తాం.

– మంచాల రుచిత, పూజా వస్త్రాల వ్యాపారి

ఆర్డర్‌పై సప్లై



దైవ కార్యాల నిర్వాహకులకు స్థానిక వ్యాపారులు ఆర్డర్‌పై ఇంటికే పూజా ద్రవ్యాలు పంపిస్తున్నారు. గతంలో ఏదైనా హోమం, ఆలయాల్లో ఉత్సవాలు, తదితరాల నిర్వహణకు హైదరాబాద్, కరీంనగర్ వంటి పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. అన్ని దైవకార్యాలకు సంబంధించిన పూజా ద్రవ్యాలు సిరిసిల్లలో దొరుకుతున్నాయి.

– నందుగ వేణుగోపాల చార్య

భక్తిభావం పెరిగింది



ప్రజల్లో పెరిగిన భక్తి, ఆధ్యాత్మిక చింతనతో అన్నివేళల్లో గిరాకీ ఉంటోంది. అన్ని పూజలకు ప్రత్యేకంగా సామన్లు సిద్ధంగా ఉంచుతాం. అవసరమైతే ఆర్డర్లపై తెప్పించి ఇస్తాం. మేము చాలా ఏళ్లుగా పూజాసామగ్రి విక్రయిస్తున్నాం. మూడాలు ఉన్న రోజుల్లో కాస్త తక్కువగా ఉంటుంది.

– రాపెల్లి పద్మ, పూజాస్టోర్ నిర్వాహకురాలు

భక్తులతో మర్యాదగా మెదలాలి


మాట్లాడుతున్న టౌన్ సీఐ వీరప్రసాద్

వేములవాడఅర్బన్: భక్తుల పట్ల ఆటోడ్రైవర్లు మర్యాదగా మెదలాలని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ అన్నారు. పట్టణంలోని కోరుట్ల బస్టాండ్, జగిత్యాల బస్టాండ్, తిప్పాపూర్ బస్టాండ్‌లోని ఆటో డ్రైవర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసంలో రాజన్న ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో వస్తారని, వారిపట్ల ఆటో డ్రైవర్లు మర్యాదగా ఉండాలన్నారు. భక్తులపై ఎవరూ దురుసుగా వ్యవహరించొద్దని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శిశువులకు తల్లిపాలే శ్రేష్ఠం


బోయినపల్లి: మాట్లాడుతున్న వైద్యాధికారిణి

ఎల్లారెడ్డిపేట: పుట్టిన ప్రతిబిడ్డకూ ముర్రుపాలు తాగించాలని, తల్లి పాలతోనే శ్రేష్ఠమని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషక పదార్థాలను ప్రతినెలా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట, లింగన్నపేట సెక్టార్ల పరిధిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు అన్నప్రాసన చేయించారు.

బోయినపల్లి: తల్లి పాలే బిడ్డకు మేలని బోయినపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి రేణుక తెలిపారు. మండలంలోని తడగొండ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేశ్ బోడపట్ల, అంగన్‌వాడీ టీచర్ రాజమణి, ఏఎన్ఎం వసంత, తల్లులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ముస్తాబాద్: మండలంలోని రామలక్ష్మణపల్లె మానేరు వాగునుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహనాన్ని శనివారం పట్టుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మానేరు వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను సిద్దిపేటకు తరలిస్తున్న వాహనాన్ని బందనకల్ వద్ద పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

బ్లడ్ స్టోరేజీ

సిరిసిల్లటౌన్: జిల్లా జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో శనివారం వరకు ఏ- పాజిటివ్ పదకొండు, ఏ-నెగెటివ్ రెండు, బీ-పాజిటివ్ ముప్పై ఒకటి, , ఏబీ-పాజిటివ్ ఐదు, ఏబీ-నెగెటివ్ ఒకటి, ఓ-పాజిటివ్ ముప్పై ఐదు, ఓ-నెగెటివ్ రెండు, మొత్తం ఎనభై ఏడు యూనిట్ల రక్తం అందుబాటులో ఉందని బ్లడ్ స్టోరేజీ ల్యాబ్ ఇన్‌చార్జి రవి తెలిపారు. అత్యవసరంగా రక్తం కావాల్సిన వారు ఫోన్: 70130 66732 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం


ఆర్థికసాయం అందిస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

వేములవాడ: మై వేములవాడ ట్రస్టు సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి అన్నారు. వేములవాడ పట్టణానికి చెందిన కోసిని లక్ష్మి కూతురు వివాహం ఈనెల 9న జరగనుంది. లక్ష్మి మై వేములవాడ ట్రస్టు సభ్యులు ఆర్థికసాయం కోసం సంప్రదించింది. ట్రస్టు సభ్యుల సహకారంతో పట్టుచీర, 50 కిలోల బియ్యం, రూ.25వేల నగదును ఏఎస్పీ చేతులమీదుగా శనివారం లక్ష్మికి అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేశ్, బెజ్జంకి రవీందర్, గొంగళ్ల రవికుమార్, తాళ్లపల్లి ప్రశాంత్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ అంతంత మాత్రంగానే సాగింది. ఈరోజు సాయంత్రం వరకు సమాచారం మేరకు...

కాంప్లెక్స్ పేరు	మొత్తం	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	08	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	56	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	04	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	05	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	55	1,008
నందీశ్వర్ నాన్‌ఏసీ	112	560
నందీశ్వర సూట్స్	08	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	94	448
పార్వతీపురం స్పెషల్	56	672
పార్వతీపురం సాధారణ	54	336

– వేములవాడ

నియామకం

వేములవాడఅర్బన్: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పెంచాల సత్యనారాయణను పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు ఆయన ధన్యవాదలు తెలిపారు.

ఉపాధి బాటలో ఊపిరి కోల్పోయారు..


అంజయ్య(ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): ఉపాధి కోసం గల్ఫ్ దేశం వెళ్లిన వ్యక్తి శవమై ఇంటికి చేరాడు. ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న కుటుంబసభ్యులు.. శవమై వచ్చిన ఆయనపై పడి రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన గెరిగంటి అంజయ్య ఆరేళ్ల క్రితం గల్ఫ్‌బాట పట్టాడు. అక్కడి కంపెనీ కొద్ది రోజులకే మూతపడడంతో అంజయ్య రోడ్డున పడ్డాడు. బయట ఎక్కడ కూడా పని దొరక్కపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలనే మానసిక వేదనతో అనారోగ్యానికి గురయ్యాడు. గత జూన్ నెలలో అక్కడి ఫుట్‌పాత్‌పైనే తుది శ్వాస విడిచాడు. పాస్‌పోర్ట్ కంపెనీ వద్దనే ఉండడంతో మృతదేహం స్వగ్రామానికి తెప్పించేందుకు కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు చాలా శ్రమించాల్సి వచ్చింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి గుండెల్లి నర్సింలు, ఎన్నారై యాసరవేని ఆంజనేయులు స్పందించడంతో అంజయ్య మృతదేహం శనివారం ఇంటికి చేరింది. మృతునికి భార్య సత్తవ్వ, కుమార్తె రేవతి ఉన్నారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.


చంద్రకాంత్ (ఫైల్)

వేములవాడరూరల్: ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లిన కార్మికుడు అక్కడ అనారోగ్యంతో మృతిచెందగా శనివారం స్వగ్రామానికి మృతదేహం చేరింది. వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రికి చెందిన పెండ్యాల చంద్రకాంత్ (55) 32 ఏళ్లుగా అబుదాబీలో పనిచేస్తున్నాడు. ఆయన అనారోగ్యంతో షేక్ కలీఫా మెడికల్ సిటీలో చికిత్స పొందుతూ గతనెల 29న మృతిచెందాడు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావాలని కుటుంబసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు అక్కడి ఎంబసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గల్ఫ్ జేఏసీ ఉపాధ్యక్షుడు గంగుల మురళీధర్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించి ఎంబసీ అధికారులతో మాట్లాడారు. దీంతో శనివారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. గల్ఫ్ జేఏసీ, ఎంబసీ అధికారులు, ప్రభుత్వానికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పొదుపు అలవాటు చేసుకోవాలి



ఎల్లారెడ్డిపేట: తపాలా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని తపాలాశాఖ సిరిసిల్ల సబ్ డివిజన్ మెయిల్ ఓవర్సీర్ సాయిరాం అన్నారు. మండలంలోని దుమాలలో తపాలశాఖ అందిస్తున్న వివిధ పథకాలపై గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రజలు పొదుపు అలవాటు చేసుకోవాలన్నారు. కార్యదర్శి మహేందర్, మాజీ సర్పంచ్ తేజా శ్రీనివాస్, తపాలశాఖ మెయిల్ ఓవర్సీర్ రాజు, సబ్ పోస్టు మాస్టర్ మాలోతు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'సెంటర్ అద్దె చెల్లించండి'

సిరిసిల్లఅర్బన్: అంగన్‌వాడీ భవనాల అద్దె చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజంకు శనివారం విన్నవించారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత మాట్లాడుతూ భవనాలకు అద్దె చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. గ్యాస్ స్టవ్, వంటపాత్రలు, పిల్లల కోసం కుర్చీలు, టేబుల్ సమకూర్చాలని కోరారు. అనంతరం సిరిసిల్ల, వేములవాడ సీడీపీవోలు సబిత, సౌందర్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. యూనియన్ నాయకులు ఓరుగంటి శ్యామల, కొండికొప్పుల పద్మ, చొప్పరి అంజలి, పద్మ, సైదాషఫీ, సరోజన, మంజుల, భాగ్య, సునీత, వాణి, లక్ష్మి, జ్యోతి, వజ్రమ్మ పాల్గొనారు.

మూడో రోజు న్యాయవాదుల నిరసన

సిరిసిల్ల కల్చరల్: సీనియర్ న్యాయవాది సురభి సత్యనారాయణరావు భూ సమస్యపై కోర్టు ఉత్తర్వులు లెక్క చేయకుండా ఎస్సై సుధాకర్ అక్రమ కేసులు విధించడంపై సిరిసిల్ల బార్ అసోసియేషన్ విధుల బహిష్కరణకు పిలుపునిచ్చింది. మూడోరోజు న్యాయవాదులు నిరసన తెలిపారు. పోలీసులు తమ వైఖరి మార్చుకునేంత వరకు విధుల బహిష్కరణ కొనసాగించనున్నట్లు బార్ అసోసియేషన్ అ. ధ్యక్ష,కార్యదర్శులు సంజీవరెడ్డి, వెంకటి తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో 'వికాస్' టాప్

సిరిసిల్లటౌన్: శాతవాహన యూనివర్సిటీ వెల్లడించిన డిగ్రీ ఫలితాల్లో సిరిసిల్ల వికాస్ కళాశాల డిగ్రీ, పీజీ విద్యార్థులు టాప్‌గా నిలిచారు. నూర్జహా బీకాం (9.6), ఓం నాయక్ బీజెడ్‌సీ (9.2), జి.దీపిక బీకాం(9.1), ఐ. ఖుషీ ఎంపీసీఎస్ (9.0), కే. సాయిభాను ఎంపిసీఎస్(9.4), ఎం.పాండే బీబీఏ (9.1), టి.మేఘన బీకాం (9.1), బి. కుమార్ బీకాం(9.0) జీజీఏ సాధించారు. విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ గుగ్గిళ్ల జగన్‌గౌడ్, అధ్యాపక బృందం అభినందించారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

కోనరావుపేట : ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని ఎస్సై శేఖర్ రెడ్డి అన్నారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమంనిర్వహించారు. ఆటోల్లో పరిమితి కంటే ఎక్కువ మందిని ఎక్కించుకోవద్దన్నారు. సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వేములవాడ ఆస్పత్రి సందర్శన

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రిని జిల్లా సూపరింటెండెంట్ పెంచలయ్య, జిల్లా వైద్యాధికారి వసంత్‌కుమార్ సందర్శించారు. పలు విభాగాలను పరిశీలించి సూచనలు చేశారు.

సన్మానం

వేములవాడ: జిల్లా మ్యాక్స్ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన కే. పురుషోత్తం, పొత్తూరి అనిల్‌కుమార్, అభిలాష్‌ను వేములవాడ కోర్టులోని బార్ అసోసియేషన్‌లో శనివారం అడ్వకేట్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..న్యాయవాదులకు ఇళ్లు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు అడ్వకేట్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.అధ్యక్షులు గుడిసె సదానందం, కార్యదర్శి అవధూత రజనికాంత్, అడ్వకేట్లు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్‌గౌడ్, పిట్టల మనోహర్, పెంట రాజు, రేగుల దేవేందర్, కిషోర్‌రావు, ప్రశాంత్, అంజయ్య, నరేశ్, మహేందర్, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజగోపాల్ శనివారం సందర్శించారు. ఆస్పత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. సీజనల్, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాల, నిమ్మపల్లిలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. మండల వైద్యాధికారి వేణు మాధవ్, సీహెచ్‌వోలు బాలచంద్రం, కృష్ణమూర్తి, సూపర్‌వైజర్ రషీద్, తదితరులున్నారు.

ఏఈఈగా ఎంపిక

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన వీరబత్తిని దివ్య రెండ్రోజులక్రితం విడుదలైన టీజీపీఎస్సీ ఫలితాల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎంపికైంది. దివ్య స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికై అక్కడే బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసింది. మే నెలలో టీజీపీఎస్సీ ద్వారా జరిగిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్ష రాసి ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైంది. దివ్యకు అప్పట్లో విద్యాబోధన చేసిన గురువులను శనివారం సత్కరించి అభినందనలు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కోనరావుపేట: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్రప్రభుత్వం ద్వారా వచ్చే కనీస వేతనం, గత 4 నెలలుగా బిల్లులు చెల్లించడం లేదన్నారు.పెండింగ్ బిల్లులను త్వరగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అఖిల భారత ప్రజాతంత్ర కార్యదర్శి జవ్వాజి విమల, కార్మికులు కవిత, బాలమణి, భాగ్యవ్వ, సత్తవ్వ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు, ఆటోలు తనిఖీ

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తాడూర్ చౌరస్తాలో శనివారం హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ స్కూల్ బస్సులు, ఆటోలను తనిఖీ చేశారు. పిల్లలకు ప్రమాదాలు జరగకుండా ఓవర్ లోడ్ తగ్గించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, యూనిఫాం తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాభావం అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేని పర్శరాములు, ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చెత్త, పిచ్చిమొక్కలను శనివారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు కలిసి శ్రమదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు,వాలంటీర్లు పాల్గొన్నారు.



మా గ్రామంలో కోతుల బెడద ఎక్కువైంది. రోడ్డుపైకి వెళ్లాలంటేనే చాలా భయంగా ఉంది. నిత్యం కోతులతో ఇబ్బంది పడుతున్నాం. బయటకు వెళ్తే వెంటపడుతున్నాయి. అధికారులు స్పందించి కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలి.

– కాల్వ దశరథం, కొత్తపల్లి, గంభీరావుపేట

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9440243048